# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

వ మాసపత్రిక

JANUARY 1996

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమములద్వారా మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకములు మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/** –లు ఈక్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ.100/ –లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరములవరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయము తెరవండి. మావద్దలభించు పుస్తకముల రేట్లు వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1 | కీర్తన పుస్తకం | రూ.14–00 |
| 2 | పెద్ద అచ్చు బైబిలు | 110–00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75–00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25–00 |

గమనిక : మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.


**SATYAVA VANI**

Sambamurthi Street, Ramaraopet,

KAKINADA - 533 004.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH
P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**
Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 జనవరి 1996 సంచిక 6

## సంపాదకీయము

## దేవుని చిత్తమును తెలిసికొనుట

## (Understanding the Will of the Lord)

"మీరు అవివేకులు కాక ప్రభువు యొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి" యని అపొ. పౌలు వ్రాసాడు (ఎఫెసీ 5: 17). ప్రభువు కొక చిత్తమున్నదని, దాన్ని మనం గ్రహించుకొనగలమని దీని యొక్క భావం. ఐతియొపీయ ఘనుడు గ్రంధమును చదువుచుయుండుట ఫిలిప్పు చూచి, నీవు చదువునది గ్రహించుచున్నావా? యని ఫిలిప్పు అతని నడిగెను (అపొ. కా. 8:30). అప్పుడతడు దాన్ని అతనికి వివరింపసాగాడు. అతడు సత్యమును విని గ్రహించుకొనినప్పుడు ప్రభువునకు విధేయత చూపించాడు. అప్పటి వరకు

క్రీస్తు ఎవరో అతడు గ్రహించుకోలేదు. రక్షింపబడాలంటే యేమి చేయాలో అతనికి తెలియదు. గనుక అంతకుముందు ప్రభువునకు లోబడలేకపోయాడు.

ఒకడు దేవునియందు విశ్వాసముంచాలని లేఖనములు బోధించుచున్నవి (హెబ్రీ 11:6). మరియు క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించాలి (యోహాను 14 :3). అంతేగాక మారుమనస్సు అనగా యేమిటో, దానిలో యేమేమి ఇమిడి యున్నాయో గ్రహించుకోవాలి (లూకా 13 :3; అపొ. కా. 2 : 38). క్రీస్తు దేవుని కుమారుడనే విశ్వాసము బలమైనదై యుండాలి. తద్వారా ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి (మత్తయి 10:32, 33). ప్రభువును మనం ఎరుగమనిన యెడల ఆయన కూడ మనలను ఎరుగననును అని పౌలు చెప్పుచున్నాడు (2తిమో 2 : 12). అట్లే బాప్తిస్మమనగా యేమిటో ఒకడు గ్రహించుకోవాలి. అది నీటిలో సమాధి యని, పాప క్షమాపణ నిమిత్తమని, అది ఒకని క్రీస్తులోను ఆయన సంఘములోను ప్రవేశింపజేయునని గ్రహించుకోవాలి (రోమా 6:3,4; అపొ. కా. 2:38).

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన పరమందున్న తండ్రి యొద్దకు ఆరోహణుడు కాక మునుపు, దేవుని రాజ్యమును గూర్చి బోధించుచు ఆయన అపొస్తలులతో అనేక దినములు గడిపెను (అపొ.కా. 1:3). ఫిలిప్పు సమరయకు వెళ్ళినప్పుడు అతడు క్రీస్తును గూర్చి వారికిబోధించెను -"అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసు క్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అపొ. కా. 8:12). గాని రాజ్యమనగా యేమిటి? అది ప్రభువు యొక్క ఆత్మీయ కుటుంబమైన సంఘము (మత్తయి 16:18,19). మరియు కొలస్సయలోని సంఘమును గూర్చి చెబుతు అది దేవుని కుమారుని యొక్క రాజ్యమని, తానును అందులో ఒక సభ్యుడని పౌలు పలికాడు (కొలస్స

1:13,14). అంతేకాకుండా మనం రక్షించబడినప్పుడు ప్రభువేమనలను తన సంఘముతో చేర్చుకొనునని చెప్పబడియున్నది (అపొ. కా. 2 : 47). క్రీస్తు సంఘమును గూర్చి ఎరుగకపోతే ఒకనికి యివేమి తెలియును? సరిగదా మతశాఖలన్నీ కలసి క్రీస్తు సంఘమవుతాయని అతడు భావించును.

క్రీస్తు ఒక సామాన్య మానవుడని లేకపోతే అనేక దేవుండ్లలో ఒక దేవుడని భావిస్తు క్రీస్తు వలన అంగీకరించబడుట సాధ్యముకాదు. అట్లే బాప్తిస్మము ఒక గురుతు అని తలంచరాదు. మరియు క్రీస్తు సంఘము మానవ కల్పిత సంస్థయని కూడ తలంచరాదు. మరియు తెలియని ఆరాధన చేస్తు అట్టి యారాధన దేవుని కంగీకారయోగ్యమైనదని తలంచరాదు (అపొ. కా. 17 : 23).

దేవుని వాక్యమే సత్యము (యోహాను 17 : 17). మరియు ఒకని రక్షించునది స్వతంత్రునిగా చేయునది సత్యమే (యోహాను 8 : 32). నేనే మార్గమును, సత్యమును,జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాలేడని యేసు చెప్పెను (యోహాను 14:6). అజ్ఞానము వలన యెవడును రక్షింపబడడు, దానివలన ఒకడు క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి రాలేడు. అతని ఆరాధన ఆంగీకారయోగ్యమైనది కాజాలదు. మరియు నేటికవుసరమైన బోధకులను అది తయారు చేయలేదు.

ఒకడు తండ్రి చిత్తమును నెరవేర్చితేనే గాని రక్షింపబడజాలడని క్రీస్తు చెప్పెను (మత్తయి 7:21). దేవుని వాక్యము వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17). మరియు సువార్త లోకమందంతటా ప్రకటింపబడవలెనని క్రీస్తు చెప్పెను (మార్కు 16:15). మనము సర్వసృష్టికి వెళ్లి సువార్త బోధించాలి. బైబిలును అనుదినం ఎందుకు చదవాలి? దేవుని చిత్తం మనము ఎరుగునట్లును దానికి లోబడునట్లును ఈ పనులు చేయాలి.

అజ్ఞానము వలన గాని అసత్యమునకు లోబడుట వలన గాని మనం రక్షింపబడజాలము. యేమీ ఎరుగకుండా ఒకడు విమానాన్ని నడిపించలేడు, వేరొక భాషను మాట్లాడలేడు. ఇటువంటి వన్ని సమయాన్ని వెచ్చించి నేర్చుకొనుట వలన సాధ్యమగును. అట్లే దేవునికి కూడ ఒక చిత్తమున్నది. దానిని మనం తెలిసికోవాలి. విశ్వసించాలి, విధేయత చూపించాలి. అప్పుడు మాత్రమే మనం రక్షింపబడగలము. దేవుని గ్రంథాన్ని చదివి ఆయన చిత్తాన్ని గ్రహించుకొనుట సాధ్యమే.

## విధేయత అవసరం

## (Obedience Necessary)

ఆయన కుమారుడై యుండియుతాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణ సిద్ధి పొందినవాడై, తనకు విధేయులైన వారి కందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను " (హెబ్రీ 5:8,9).

ఈ దినములలో "అణుకువ" లేక "విధేయత" అనునది ఒక క్రొత్త పదమువలె కనబడుచున్నది! పిల్లలు తల్లి దండ్రులకు అణిగిమణిగి యుండుట అరుదై పోయినది ; దేశ పౌరులు పౌరసంబంధమైన, న్యాయ సంబంధమైన ప్రభుత్వ చట్టములను గౌరవించకుండా అవిధేయులై తరచూ ధిక్కరించడం పరిపాటయినది. ఇక ప్రజలయితే ఎప్పటి కప్పుడు దేవుని చట్టాన్ని ఆజ్ఞలను తిరుగుబాటు ధోరణిలో తిరస్కరిస్తూనే యున్నారు. మనకు సకాలంలో అపోస్తలుడైన పౌలు ద్వారా ఈ క్రింది వాక్యము ప్రవచింపబడినది : "అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలుసుకొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థపరులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు,

అపవిత్రులు అనురాగరహితులు, అతిద్వేషులు,అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జన ద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవుని కంటే సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు" (2 తిమో 3:1-4).

## గొప్ప మాదిరి

దేవుడు తన చిత్తమునకు సంపూర్ణ విధేయతను చూపే మాదిరిని క్రొత్త నిబంధనలో మనకు తేటపరచెను. "క్రీస్తు కూడా మీ కొరకు బాధ పడి మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" (1పేతురు 2 : 21,22). క్రీస్తు చూపిన విధేయతను గ్రహించి కూడా "స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణనియమము" (యాకోబు 1:25)నకు వ్యతిరేకముగా తిరిగినట్లయిన మనకు యిక క్షమాపణయుండదు. యేసు క్రీస్తు తన పంద్రెండవ యేటనే తన తండ్రి చేయుపనిలో అణుకువగా సహకరించుట నేర్చుకొనెను (లూకా 2:42-52).

ఆయన తన నిర్విరామ సేవలో ఈ విధంగా నొక్కి చెబుతుండేవాడు. "పగలున్నంతవరకూ నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను. రాత్రి వచ్చుచున్నది. అప్పుడెవడును పనిచేయలేడు (యోహాను 9: 4). దీనిని బట్టి దేవుని చిత్తమును నెరవేర్చుటలో "విధేయత" ను కలిగి యుండాలని, అంతేకాక "తక్షణమే" చేయాలని బోధపడుచున్నది. అవకాశము అర్హత ఉన్నప్పుడే మనిషి ఆత్మీయ ఫలాలు పొందడానికి ఒక పధకం ప్రకారం పనిచేయాలి.

కపాల స్థలమనబడే గొల్గోతా అను చోట సిలువవేయబడే సన్నివేశానికి ముందు ఒలీవ కొండ మీద ఆయన చేసిన ఆఖరి ప్రార్ధన, "తండ్రీ, ఈగిన్నె నా యొద్దనుండి తొలగించుటకు నీ చిత్తమైతే తొలగించుము. అయినను నా

యిష్టము కాదు నీ చిత్తమే సిద్ధించుగాక అని ప్రార్థించెను" (లూకా 22:42). ఇందులో మనకు విధేయతను ఆయన ప్రబోధించెను.

## పరలోకం విధేయులకే

పరలోకములో ఎవరు ప్రవేశిస్తారు? అను ప్రశ్నకు "విధేయులే" అని లేఖనాలు గట్టిగా చెప్పుచున్నవి. కొండమీద ప్రసంగంలో రక్షకుడు - " ప్రభువా ప్రభువా అని నన్నుపిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నాతండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21) అని హెచ్చరించెను. తండ్రి చిత్తమునే నెరవేర్చాలి. ఈ క్రొత్త నిబంధన చట్టము నా కొరకు, నీ కొరకు అందరి కొరకు క్రీస్తు చనిపోయిన నాటినుండి ఈయబడియున్నది.

యోహాను ప్రకటన గ్రంధం చివరి పుటను వ్రాస్తూ ఆయన ఆజ్ఞలను శిరసావహించు వారు ధన్యులు. వారు జీవవృక్షమునకు హక్కుదారులై గమ్మములగుండా పట్టణములో ప్రవేశింతురని చెప్పెను ( ప్రకటన 22 : 14).

ఎక్కడయితే జీవజలములు ప్రవహిస్తూ ఉన్నవో, ఎక్కడ నిత్యము జీవ వృక్షములు ఫలిస్తూ ఉన్నవో, ఎక్కడ కన్నీళ్ళకు చోటులేదో , ఎక్కడ చావు దుఃఖము కనరాదో, ఎక్కడ ఏడ్పు బాధ వుండవో - ఆ పరలోక నివాసంలో విధేయులకు మాత్రమే స్థానము కలదు. వారే అర్హులు.

అసలు ఎందుకు ఈ ప్రజలలో అనేకులు క్రీస్తు బోధను క్రొత్త నిబంధన లేఖనములను లక్ష్యపెట్టక యున్నారు? ఇహలోక దురాశలలో పడి నిత్యసంతోషాన్ని కలిగించు పరలోక ద్వారాన్ని బలవంతంగా మూయుచున్నారు?

దేవుని చిత్తమును వినక పోయినట్లయిన, మనమంతట మనమే రక్షించే

శక్తిగల సువార్త నుండి వేరు చేయబడుచున్నామని గ్రహించాలి (రోమా 1 : 16). క్రీస్తును అంగీకరింపక ఆయనయందు విశ్వాసముంచక పోయినట్లయితే నిశ్చయముగా మనమంతట మనమే పాపంలోనే యుండి చనిపోవుదుము (యోహాను 8:24). ఎవరయితే మారు మనస్సు పొందే అవకాశాన్ని జారవిడచుకుంటారో వారు పాపములు తుడిచి వేయబడే ఆధిక్యతను కోల్పోవుచున్నారు. ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6 : 23). క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనక పోయినట్లయితే - ప్రతి మంచిని, సంపూర్ణ వరములను యిచ్చువాడు, వెలుగులకు తండ్రి అయిన దేవుని తిరస్కరించుటే (మత్తయి 10 : 32,33).

మరి ముఖ్యముగా ఎవరయితే క్రొత్తనిబంధన బాప్తీస్మమును (మత్తయి 28 : 18 - 20 ; మార్కు 16 : 15, 16) క్రీస్తే ఆజ్ఞాపించెనని ఒప్పుకోరో వారు క్రీస్తు సిలువపై కార్చిన రక్తము యొక్క విమోచనా శక్తిని అనగా పాపక్షమాపణ శక్తిని ( రోమా 6 : 3-6: కొలస్స 2 : 12, 13 ) శంకించి, తిరస్కరించు వారగుదురు. దేవుని వాక్యానికి ఏమి కలిపినా, ఏమి తీసివేసినా అది అవిధేయతే అగును. దాని పర్యవసానము ( ప్రకటన 22 :18,19) జీవ గ్రంధమునుండి తొలగింపబడుటయే.

మానవుని అవిధేయత, తిరుగుబాటు ధోరణికి పరిష్కారం ఏమిటి? ఒక్కసారి వెనక్కి యెరూషలేము వెళ్ళి "క్రీస్తు మనస్సు" (ఫిలిప్పీ: 5-8) తెలుసుకొందము. కొలస్సలోని వారు బాప్తిస్మమందు ఆయనతో కూడా పాతిపెట్టబడి - దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడా లేచితిరి (కొలస్స 2 : 12). మనము అట్లు చేయాలి.

మనం ఒక్కసారి సమూయేలు యొక్క భావనను పరిశీలించుదము. "బలులు అర్పించుటకంటే ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట

కంటే మాట వినుటయు శ్రేష్ఠము ; తిరుగుబాటు చేయుట సోదె చెప్పుటయను పాపముతో సమానము ; మూర్ఖతను అగపరచుట మాయా విగ్రహము గృహదేవతలను పూజించుటతో సమానము" (I సమూయేలు 15 : 22, 23).మనం దేవుని చిత్తాన్ని ఎరిగి ఎల్లప్పుడు విధేయులమై పరలోకం చేరుకొందుము గాక!

-ఫ్రెడ్ డిల్లాన్.

కొండమీద ప్రసంగము - 19

# ప్రేమ సూత్రము

## (The Law of Love)

## (మత్తయి 5 : 43 - 48)

కొండమీద నుండి యేసు తన శిష్యులకు చేసిన బోధలో ఒక నూతన జీవిత విధానము రాబోవుచున్నదని తెలియజేసారు. ఈ నూతన విధానములో ఒక నూతన పురుషుడు, నూతన నీతి ఉంటాయి. మన ప్రభువు ధర్మ శాస్త్రప్రకారమున జన్మించెను (గలతీ 4 :4). ధర్మ శాస్త్రప్రకారము జీవించెను, ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు వచ్చెను ; ఆ పనిని ఆయన సంపూర్తిగ జరిగించెను ( మత్త 5:17; యోహాను 17:4). మోషే ధర్మశాస్త్రాన్ని ఆయన ఒక్క మారు కూడ ఉల్లంఘించలేదు. ఆయన ధర్మ శాస్త్రముప్రకారము జీవించినను, ఆయన రాజ్యములో లేక క్రొత్త నిబంధన సంఘములో యుండబోవు అధికమైన నీతి విధానమును విశదీకరించెను. ఆయన ఇట్లు బోధించెను :

" నీ పొరుగు వానిని ప్రేమించి నీ శత్రువును ద్వేషించు మని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులైఉండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్ధన చేయుడి. ఆయన చెడ్డవారి మీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను అనీతి మంతుల మీదను వర్షము కురిపించు చున్నాడు. మీరు మిమ్మును ప్రేమించిన వారినే ప్రేమించిన యెడల మీకేమి ఫలము కలుగును ? సుంకరులును అలాగున చేయుచున్నారు గదా. మీ సహోదరులకు మాత్రము వందనము చేసిన యెడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి? అన్యజనులును అలాగు చేయుచున్నారుగదా. మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు " (మత్తయి 5:43 - 48).

## శత్రుప్రేమ

నీ పొరుగువాని ప్రేమించి నీ శత్రువును ద్వేషించాలని పాతనిబంధన కాలములో ఇశ్రాయేలుకు చెప్పబడినది. నేను మీతో చెప్పున దేమనగా మీ శత్రువులను ప్రేమించుడి యని క్రీస్తు బోధించెను. ఈ శత్రుప్రేమలో హింసించు వారికొరకు ప్రార్ధన చేయడం, ద్వేషించు వారికి మేలు చేయడం, అబద్ధముగా చెడ్డమాటలు. చెప్పువారి కొరకు ప్రార్ధన చేయడం ఇమిడియున్నాయి. మనం అందరికీ, చివరకు శత్రువులకు కూడ మేలు చేయుటకు ఇచ్ఛయించుకోవాలి.

శత్రువులను సహా ప్రేమించడంలో కలిగే ఫలితం యేమిటి? "మీరు పరలోక మందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు" అని ప్రభువు చెప్పారు. ఇట్టి మనస్సు మనం కలిగియుంటే దేవుని యెడల సరియైన మనస్తత్వం కలిగి యుంటాము. " తండ్రి నన్ను ఏలాగు ప్రేమించెనో, నేనును

మిమ్మును ఆలాగు ప్రేమించితిని; నాప్రేమ యందు నిలిచి యుండుడి. నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనిన యెడల నా ప్రేమ యందు నిలిచియుందురు" అని ప్రభువు చెప్పారు (యోహాను 15:9 - 10). "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15). "మనమాయన ఆజ్ఞలను గైకొటయే దేవుని ప్రేమించుట" (1 యోహాను 5 : 3).

శత్రు ప్రేమ వలన యితరుల యెడల మనము సద్భావన కలిగియుండుటకు సహాయపడతాది. "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరొకని నొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు. నేను మీ కాజ్ఞాపించువాటిని చేసిన యెడల మీరు నా స్నేహితులై యుందురు (యోహాను 15 : 12 –13). " ప్రియులారా, మనము ఒకని నొకడు ప్రేమింతము. ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది. ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టిన వాడై దేవుని ఎరుగును. దేవుడు ప్రేమా స్వరూపి: ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4 :7-8). "ప్రియులారా, దేవుడుమనలను ఈలాగు ప్రేమింపగా మన మొకని నొకడు ప్రేమింపబద్ధులమై యున్నాము" (1 యోహాను4:11). ఈ ప్రేమ మనలను గూర్చిన సరియైన అవగాహన మనకు కలుగ జేయును. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమించుకోవాలి. యిది అహంభావముకాదు, అహంకారము కూడ కాదు. గాని ఒకని ఆత్మను గూర్చియు, పరులను గూర్చియు సరియైన అవగాహన కలిగియుండును.

తరువాత, యేసుప్రభువు తన ప్రేమ సూత్రమును మనకు ఉదాహరణ పూర్వకంగా వివరించారు. అట్టిప్రేమను పరలోకమందున్న దేవుడు మన యెడల నిరంతరము చూపుచునేయున్నాడు " ఆయన చెడ్డవారి మీదను

మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించు చున్నాడు."ఈ రీతిగా దేవుడు మంచి వారికేకాదు గాని చెడ్డవారికిని కూడ (అంటే ఆయన లేడని చెప్పే బుద్ధిహీనులకు కూడ) మేలు చేయుటకు ఇచ్ఛయించుకొని యున్నాడు. "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము" (గలతి 6:10).

మీ శత్రువులను ప్రేమించుడి యనే క్రొత్తప్రేమ సూత్రాన్ని ప్రభువు తన శిష్యులకు పరిచయం చేస్తూ కొన్ని తీవ్రమైన ప్రశ్నలు వేసారు: "మీరు మిమ్మును ప్రేమించువారినే ప్రేమించిన యెడల మీకేమి ఫలము కలుగును? సుంకరులును ఆలాగు చేయు చున్నారు గదా! మీ సహోదరులకు మాత్రము వందనము చేసిన యెడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి? అన్యజనులును ఆలాగున చేయుచున్నారుగదా? మనలను ప్రేమించిన వారినే ప్రేమించినా, వందనములు చెప్పిన వారికే వందనములు చెప్పచున్నాయిదేమి క్రొత్తకాదు. క్రీస్తును వెంబడించని వారు కూడ చేసేది యిదే. అయితే క్రీస్తును వెంబడించువారు యింతకంటె ఎక్కువ కనుబరచాలి. శాస్త్రుల నీతి కంటెను పరిసయ్యుల నీతి కంటెను, ఈలోకపు నీతి కంటెను వారి నీతి అధికము కావాలి. యిది క్రీస్తురాజ్య మూల సూత్రం.

## తండ్రి మాదిరి

తరువాత మన ప్రభువు ప్రేమించుడి అనే ఆజ్ఞయిచ్చారు. " మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" అని ఆయన చెప్పారు. అంటే ప్రేమవిషయంలో మీ పరలోకపు తండ్రి యొక్క

మాదిరిని అనుసరించుటకు జాగ్రత్త పడుడి యని ఆయన యొక్క భావం. ఈ లోకం ప్రేమించాలన్నా అసహ్యంగా యున్నది. అయినను దేవుడు లోకము నెంతో ప్రేమించెను. మానవులు దేవునికి శత్రువులుగా యున్నను సరే వారునీతి మంతులుగా తీర్చబడి, దేవునితో సమాధానము కలిగియుండే మార్గాన్ని ఆయన వారికి ఏర్పరచెను (రోమా 5:1). "ఏలయనగా, మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతి మంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు: మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తుమన కొరకు చనిపోయెను" (రోమా 5:5-8). శత్రువులను సయితము ప్రేమించే ప్రేమ దేవుని ప్రేమ. దానిని మనం కలిగియుండాలని ఆయన బోధించారు.

యూదులకు సమరయులకు మధ్య శత్రుత్వముండేది. యూదులు సమరయులతో సాంగత్యము చేసే వారు కారు (యోహాను 4:9). అయితే యేసు ప్రభువు మంచి సమరయుని గూర్చి చెప్పిన సందర్భములో ఆయన కోరే ప్రేమను చక్కగా వర్ణించారు. ఒకమనుష్యుడు (బహుశ యూదుడు కావచ్చును) యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్ళుచు దొంగల చేతిలో చిక్కెను; వారతని బట్టలు దోచుకొని, అతని కొట్టి కొరప్రాణముతో విడిచి పోయిరి. అప్పుడొక యాజకుడు అతని చూచి ప్రక్కగా పోయెను; అలాగుననే లేవీయుడొకడు చూచి ప్రక్కగాపోయెను. అయితే ఒకసమరయుడు ప్రయాణమై పోవుచు అతని చూచి, అతని మీద జాలి పడి, దగ్గరకు పోయి నూనెయు ద్రాక్షరసమును పోసి అతని గాయములు కట్టి తనవాహనము మీద ఎక్కించి యొకపూటకూళ్ళవాని యింటికి తీసికొనిపోయి అతని పరామర్శించెను.

మరునాడతడు రెండు దేనారములు తీసి అపూటకూళ్ల వానికిచ్చి ఇతని పరామర్శించుము. నీవింకేమైనను ఖర్చుచేసిన యెడల నేనుమరల వచ్చునప్పుడు అదినీకు తీర్చెదనని చెప్పిపోయెను. ఈ మంచి సమరయుడు ఒకయూదునికి సయితము మేలుచేయుటకు ముందుకు వచ్చెను. ప్రభువు కోరుచున్న ప్రేమయిట్టిదే.

యేసు ప్రభువు శత్రువులు ఆయనను పట్టుకొనిరి, కొరడాలతో కొట్టిరి, గుద్దిరి, ముఖముమీద ఉమ్మివేసిరి, ఇద్దరు నేరస్థులమధ్య ఆయనను సిలువ వేసిరి. అయితే "యేసు తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" వారికొరకు ప్రార్థన చేసెను. నిజంగా యేసు యేమి బోధించెనో దాన్ని ఆయన చేసి చూపించెను. మనం పాపం చేసి ఆయనకు శత్రువుల మయ్యాము. అయినను ఆయన దేవుని కుమారుడని విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల ఆయన మనలను రక్షిస్తాడు. నీవు ఇంకను రక్షింపబడలేని యెడల నీకు సమీపముగ యున్న క్రీస్తు సంఘమును ఈ నాడే దర్శించు!!

-జాషువా గూటం.

## బైబిలును అర్థము చేసికొనుటకు పది సూత్రములు

## (Ten Simple Reasons to Understand the Bible)

( గత సంచిక తరువాయి)

7. బైబిలులోని ఏ మాటనైనా గ్రహించుకోవాలంటే మూడు సంగతులు గమనించాలి :

ఎవరు, ఎప్పుడు, ఎవరితో చెప్పారు? అనే సంగతులు తెలిసికోవాలి. ఎవరు చెప్పారు? అనునది ఆలోచించాలి. నీవు చదువు చున్నది ఆత్మ ప్రేరితుని మాటా? లేక వేరొకడు చెబితే అది అక్కడ రికార్డు చేయబడిందా? "మీరు చావనే చావరు" అనే సాతాను యొక్క అబద్ధాన్ని ఆదికాండము 3:4 లో రికార్డు చేయబడింది. గనుక ఎవరు చెప్పారు? అనే అంశము గమనించుట ప్రాముఖ్యము.

ఎవరితో చెప్పబడింది? అనే సంగతి కూడ ఆలోచించాలి. అది అందరికీ చెప్పబడిందా? లేక ప్రత్యేకంగా కొందరికేనా? అను సంగతి తెలిసికోవాలి. సర్వసృష్టికి కొన్ని సంగతులు చెప్పబడాలని క్రీస్తు చెప్పారు (మార్కు 16:15-16). దేవుని వాక్యాన్ని బయలు పరుస్తు స్థిరపరచుటకుగాను అపొస్తలులకే చెప్పబడిన మరికొన్ని మాటలు కూడ ఉన్నాయి. ఏమి చెప్పుదుము? ఏలాగు చెప్పుదుము? అనే సంగతులను గూర్చి అపొస్తలులు బాధపడనవసరంలేదు (మత్తయి 10:19–20). మనమైతే దేవుని వాక్యాన్ని చదవాలి (2 తిమో 2:15).

అది క్రైస్తవుడు కాని వానికి, క్రైస్తవుడగుట యెట్లో చెప్పబడిందా? లేదా క్రైస్తవుడైన వానికే చెప్పబడెనా? దీనిని కూడా తెలిసికోవాలి.

ఎప్పుడు చెప్పబడింది? అనే సంగతిని కూడ ఆలోచించుకోవాలి. అదొక ఆజ్ఞా? లేక మామూలుగా చెప్పబడిన మాటా? అది క్రీస్తుకు ముందు యూదులకు చెప్పబడిందా? లేదా క్రీస్తే తన శిష్యుల నాజ్ఞాపించెనా? అనేకులు పాతనిబంధనకాలపు యూదుల ఆరాధనను క్రొత్తనిబంధన ఆరాధనతో మిళితము చేసి పొరబడుతు యుంటారు.

క్రీస్తు చనిపోయిన తరువాత గాని క్రొత్త నిబంధన పద్ధతి అమలులోనికి రాలేదని గ్రహించుము. మరణ శాసనము వ్రాసిన వాడు మరణిస్తేనే అదిచెల్లును గాని అతడు జీవించుచుండగా ఎప్పుడు చెల్లదు అని హెబ్రీ 9:16-17 లో

వ్రాయబడి యున్నది. యేసు ప్రభువు క్రొత్త నిబంధనను బోధించుచున్నను, ఆయన పాతనిబంధన కాలములోనే జీవించుచుండెను. గనుక పశుబలుల నాజ్ఞాపించెను (లూకా 5:14; లేవీ 14:4-10), యూదుల సబ్బాతును (లూకా 4: 16), మరియు పస్కాను ఆచరించెను (మత్త 26:18).

**8 అలంకార రీతిగ చెప్పబడితేనే గాని ఆయా మాటలు, పదములు అక్షరార్థముగానే గ్రహించుకోవాలి:**

ఆయా పదములకున్న సహజ అర్థమును తెలిసికోవాలి. దాన్ని తెలిసికొనుటకు ఒక నిఘంటువును వాడుకోవచ్చును. బైబిలులో ఆయా పదములు ఎట్లు వాడబడెనో తెలిసికోవాలి. ఉదా: బాప్తిస్మము. ఆదిమ గ్రీకులో యిది ముంచబడుట అను అర్థము కలిగియున్నది. దాన్ని బైబిలు వాక్యములతో చూచి గ్రహించుకోగలము. మత్తయి 3:16; అపొ.కా. 8: 36-38; రోమా 6:3-4 ను చదువుము.

**రూపకాలంకారములను గ్రహించుకొనుము** : అన్ని భాషలలోను రూపకాలంకారములు వాడబడును. తద్వారా సంభాషణ చిత్రీకరించినట్లుండును. రూపకాలంకారము వాడబడినప్పుడు దానిలోని మాటలను అక్షరార్థముగా గ్రహించుకోరాదు. కుయుక్తిపరుడైన హేరోదును గూర్చి చెబుతు యేసు, "మీరు వెళ్లి ఆనక్కతో ఈలాగు చెప్పుడి" యనెను (లూకా 13:32). హేరోదు నిజముగానక్కకాదు. అతడు నక్క వలె యుండెను. యోహాను యేసును "దేవుని గొర్రెపిల్ల" యని వర్ణించెను. అయితే యేసు నాలుగు కాళ్ల గల నిజమైన గొర్రెపిల్ల యని దీని యర్థము కాదు. బలిగా అర్పింపబడుటకు తేబడిన గొర్రెపిల్ల వలె ఆయన యుండెను. సిలువ మరణములో యేసు ప్రభువు పాప ప్రాయశ్చిత్తార్థ బలియాయెను.

యేసు క్రీస్తు ప్రభురాత్రి భోజనమును ప్రతిష్ఠించుచు ఒక రొట్టెను పట్టుకొని తన శిష్యుల కిచ్చి - మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను (మత్త 26: 26). ఆరొట్టె ఆయన మాంసముకాదు గాని అది ఆయన శరీరమునకు గురుతు అని మనం గ్రహించుకొంటాము (I కొరింధీ 11:24-27).

## 9. ఏ వచనమునైనను సందర్భానుసారముగ గ్రహించుకొనుము:

బైబిలులోని ఏవచనమైనను అది చెప్పబడిన సందర్భమును బట్టి గమనించుకోవాలి. దాన్ని తెలిసికొనుటకు దానికి ముందు, వెనకాయున్న వచనములను చదువుట మంచిది. మరియు ఆ అధ్యాయములో ఏ అంశాన్ని గూర్చి చెప్పబడిందో గమనించుము.

కొందరు బైబిలులోని మాటలను ఇక్కడ అక్కడా తీసికొని వాటిని సందర్భరహితముగా ఉపయోగిస్తారు. అది విచారకరం. సరిగదా బైబిలులో లేని సిద్ధాంతములను నిరూపించుటకు వారు వీటిని వినియోగిస్తారు. మత్తయి 27:5లో యూదాపోయి ఉరిపెట్టుకొనెను అని యున్నది. "నీవును వెళ్లి ఆలాగ చేయుమని" లూకా 10:37 లో యున్నది. "నీవు చేయుచున్నది త్వరగా చేయుమని" యోహాను 13:27లో వ్రాయబడియున్నది. ఈ లేఖనాలను బట్టి మనము పోయి ఉరిపోసుకోవాలా? కానేకాదు. అయితే పైనున్న వచనాలను సందర్భరహితముగా ఉపయోగిస్తే యేమిజరుగునో యిది తెలియ జేయుచున్నది.

సందర్భాన్ని గమనించునప్పుడు ఆచారములకు ఆజ్ఞలకు గల వ్యత్యాసమును గమనించుము:

కొన్ని సంగతులు ప్రత్యేకముగా ఆజ్ఞాపింపబడినవి. యేసు ఇట్లు చెప్పెను : "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు" (యోహా

14:21). క్రీస్తు అపొస్తలులకు ఆజ్ఞలనిచ్చెను (అపొ.కా. 1:2; మత్తయి 28:19-20; అపొ.కా.10:48; I కొరింథీ 7:10-11). ఈ ఆజ్ఞలను వారెట్లు గైకొనిరో కూడ బైబిలు బోధించుచున్నది. మనం ఆజ్ఞలను, వాటి ఉదాహరణలను అనుసరించాలి.

కొన్ని సంగతులు నాటి కాలపు ఆచారములైయుంటాయి. అయితే సాంఘికాచారములు ఆజ్ఞలు కానేరవు. దేవుని ఆజ్ఞకు విరోధముగా యున్న ఏ ఆచారమునైనను తిరస్కరించాలి (మత్తయి 15: 8-9). దేవుని ఆజ్ఞకు విరోధముగా లేని సాంఘికాచారములను పాటించినను, పాటించక పోయినను ఫరవాలేదు. కొన్ని సామాజిక ఆచారములు మర్యాదను చూపుటకు పాటించునట్టివి (I కొరింథీ 11:14-16).

## 10. ఏ అంశమైనను, బైబిలు అంతటిలో దాన్ని గూర్చి యేమి చెప్పబడినదో తెలిసికొనుము:

ఒక అంశము పై బైబిలులో చెప్పబడిన దంతయు అంగీకరించుట యుక్తమగును. మనం సత్యాన్ని, సత్యాన్నే తప్ప మరి దేనిని కోరుకోకూడదు. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17 : 17). గనుక దాన్నంతటిని మనం అంగీకరించాలి. యేసు "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటి నుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును" అని చెప్పెను. ప్రతి మాట అని ఆయన చెప్పెను. కొర్నేలిసరియైన స్వభావము కలిగియుండెను : అతడు పేతురుతో, "నీవు వచ్చినది మంచిది. ప్రభువు నీకు ఆజ్ఞాపించిన వన్నియు వినుటకై యిప్పుడు మేమందరము దేవుని యెదుట ఇక్కడ కూడి యున్నామని చెప్పెను" (అపొ.కా. 10:33).

అనేకులు బైబిలు చదువకుండగానే వారి సొంత అభిప్రాయములను ఏర్పరచుకొందురు, సరిగదా వారి యభిప్రాయములకు అనుగుణంగా బైబిలును

మల్చుటకు ప్రయత్నింతురు. ఒకడు రక్షింపబడాలంటే విశ్వసించాలని వారు ఒప్పుకొంటారు. అయితే విశ్వాసము మాత్రమే చాలునని వారు దానికి కలుపుతారు. మరియు విధేయత చూపు విశ్వాసము అవసరమని చెప్పు బైబిలు బోధను వారు నిరాకరిస్తారు (రోమా 1:5; 16:26; గలతీ 5:6; యాకోబు 2:19-24; హెబ్రీ 5:9; లూకా 6:46). మనము రక్షింపబడాలంటే కొన్ని బైబిలు షరతులకు లోబడాలి. విశ్వాసమువలన మాత్రమేకాదు. మార్కు 16:16; అపో. కా. 2:38; 11:18-22; రోమా 10:9,10; I పేతురు 3:21 చదువండి. ఏఅంశమును గూర్చి యైనను బైబిలు చెప్పునదంతయు అంగీకరించాలి.

బైబిలులోని ప్రాధమిక సంగతులను తెలిసికొని, దేవుడు కోరు రీతిగ జీవించుటకు మొదలు పెట్టి దేవుడు బైబిలులో చెప్పిన సంగతులను గూర్చిన జ్ఞానమును మనం దినదినము అభివృద్ధి పరచుకోవాలి. తన గ్రంధములో దేవుడు అన్నిటినీ మనకు బయలు పరచలేదు. "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును" (ద్వితీ 29:29), అయితే ఆయన బయలు పరచిన సంగతులను చదివి ధ్యానించుట వలన ఆశీర్వదించబడుదుము.

కొందరు నిరుపయోగమైన బైబిలు అంశములపై తమ సమయాన్ని వెచ్చిస్తారు. అందరికంటె పొడవైన వాడెవడు? అందరికంటె బలవంతుడెవడు? ఎక్కువ కాలము బ్రతికిన వాడెవడు? మొదలగునవి. మరికొందరు ఒకటి రెండు అంశములను తెలిసికొని అంతటితో ఆగిపోతారు. అయితే మనము "యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందాలి" (I పేతు 3:18).

మనలో యున్న దురభిమాన ద్వేషమును విడనాడి సత్యమును గ్రహింతము. దేవుని వాక్యమందలి జ్ఞానంలో మనము పెరుగుచుండగా యిదివరకు మనము ఏర్పరచుకొనిన భావములు తప్పు అని గ్రహించగానే, వాటిని విసర్జించాలి, సత్యాన్ని చేపట్టాలి. అప్పుడుదేవుడు సంతోషిస్తాడు!!

- చార్ల్స్ స్కాట్.

# అదృశ్యమైన వాటిని తిలకించుట

## (Seeing the Invisible)

"మేము దృశ్యమైన వాటిని చూడక అదృశ్యమైన వాటినే విదావించి చూచుచున్నాము; ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు; అదృశ్యమైనవి నిత్యములు" (2 కొరింథీ 4:18).

I. అదృశ్యమైనవి యేమిటి ? వాటి అంతమేమి ?

1. నేడు మనము నేత్రములతో చూడగలుగు చున్నవన్నియు దృశ్యములే. అవన్నియు అనిత్యములు. ఉదా; సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, వృక్షములు మొ॥నవి. పదార్థముతో నిర్మితములైన వన్నియు భౌతిక సంబంధమైనవే. దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదు గాని దేవుని వాక్యము (ఆత్మ) వలన నిర్మాణమయ్యెను(హెబ్రీ 11;2,3). "ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల నాశనము జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువ చేయబడినవై, అదే వాక్యము వలన భద్రము చేయబడి యున్నవి" (II పేతురు 3:7). "అయితే ప్రభువు దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును. పంచ భూతములు మిక్కటమైన వేంద్రముతో లయమై పోవును, భూమియు దాని మీద నున్న కృత్యములును కాలిపోవును" (II పేతురు 3:10).

II అదృశ్యమైనవి నమ్ముట వలన ప్రయోజనమేమి ?

1. చూచుచున్న వాటి యందు విశ్వాసముంచ నవుసరములేదు. మరొక మాటలో, చూడని వాటికొరకు విశ్వాసముంచవలెను అని భావము.

2. కంటికి కనబడని వాటియందు నిరీక్షించుటయే విశ్వాసమనబడును.

"విశ్వాసమనునది అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువై యున్నది" (హెబ్రీ 11:1). ఉదా: "మీరు క్రీస్తును చూడక పోయినను ఆయనను ప్రేమించుచున్నారు; ఇప్పుడు ఆయనను కన్నులార చూడకయే విశ్వసించు చున్నారు" (I పేతురు 1:8). చూచి విశ్వసించిన వారికంటె చూడకయే విశ్వసించినవారు ధన్యులు అని యేసు చెప్పెను (యోహాను 20:29). అదృశ్యమైన వాటిని నమ్ముట వలన మనము ధన్యులమగుదుము

## II. మనము వేటిని విశ్వసింపవలెను ?

దేవుని యొక్క ఉనికిని - కీర్తనలు 14:1 ; హెబ్రీ 11 : 6. క్రీస్తు రెండవ రాకడను - I పేతురు 3 : 9, హెబ్రీ 10 :37. మృతుల పునరుత్థానమును - I కొరింధీ 15 :12-32 ; యోహాను 5 :28,29. మష్యులందరికి కలుగబోవు అంత్య తీర్పును. మత్తయి 25 : 32. పరలోకమును, నరకమును ప్రకటన 21 :8,9.

## IV. అదృశ్యమైన వాటిని నమ్ముట సాధ్యమా ?

1. "ప్రభూసంబంధమైన సంగతులు నేను మీతో చెప్పితే మీరు నమ్మకున్నప్పుడు పరలోక సంబంధమైనవి మీతో చెప్పిన యెడల ఏలాగు నమ్ముదురు ? " (యోహాను 3 :12 ). "దేవుడు ఎవరిని పంపెనో ఆయనను మీరు నమ్మలేదు గనుక ఆయన వాక్యము మీలో నిలిచియుండ లేదు" (యోహాను 5 :38). ఆ వాక్యము శరీర ధారియై వారి మధ్య నివసించినను వారు నమ్మక పోయిరి. త్రోవ ప్రక్క నుండువారు వీరే (మార్కు 4 : 15 ).

2. " అధికారులలో అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని సమాజములో నుండి వెలివేయ బడుదుమేమో యని పరిసయ్యులకు

భయపడి వారు ఒప్పుకొనలేదు" (యోహాను 12 : 42). మరికొందరు కొంతకాలము విశ్వసించిరి గాని వెనుకతీసి వేరైపోయిరి (యోహాను 6 : 66). రాతి నేలను విత్తబడిన వారు (మార్కు 4 : 16, 17).

3. ముండ్ల పొదలలలో విత్తబడిన వారు (మార్కు 4 : 18).

ఇస్కరియోతు యూదా (యోహా 12 : 6 ; మత్తయి 27 : 5).

అననీయ, సప్పీరాలు (అపొ 5 : 1 - 6).

దేమా ( II తిమో 4: 10).

4. ఎ) అదృశ్యమైన వాటిని నమ్ముట యందు నిలకడగా యుండు వారే మంచి నేలను విత్తబడినవారు (మార్కు 4 : 20 : I కొరింథీ 16 : 13).

బి) వాక్యమును విని, గ్రహించి, అంగీకరించి, అవలంబించువారే నిత్యము అదృశ్యమైన వాటిని నమ్మగలరు (లూకా 8 : 15).

సి) వారు నూరంతలుగా ఫలింతురు.

## V. అదృశ్యమైన వాటియందు మరణ పర్యంతరము నిలకడగా నుండిన వారు :-

1. విశ్వాసమును బట్టి నోవహు "అది వరకు చూడని సంగతులను" గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన యింటి వారి రక్షణ కొరకు ఓడను సిద్ధము చేసెను (హెబ్రీ 11 : 7).

దేవుడు వాగ్దానము చేసిన జలప్రళయము అంతకు మునుపు ఎన్నడును సంభవింపలేదు. అయినను ఆ విషయము నిజముగా జరుగునని అతడు విశ్వసించెను. అందువలన అతడు లోకము మీద నేరస్థాపన

చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను.

2. "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణము (అదృశ్యమైనది) కొరకు అబ్రహాము ఎదురుచూచు చుండెను" (హెబ్రీ 11 : 10). దేవుడు అబ్రహామును పిలువగా ఎక్కడికి వెళ్ళవలెనో ఎరుగకయే బయలు వెళ్ళెను. గుడారముల యందు నివసించెను. అన్యుల దేశములో ఉన్నట్టుగా వాగ్దత్త దేశములో పరవాసుడాయెను. అబ్రహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను (హెబ్రీ 11 : 17). మృతులలో నుండి సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచిన వాడై (ఆది 22 : 5), తన యేక కుమారుని అర్పించెను. ఉపమాన రూపముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను. గనుకనే విశ్వాసులకు మూల పురుషుడు (గలతీ 3 : 29), దేవునికి స్నేహితుడును ఆయెను (యెషయా 41 : 8).

3. "విశ్వాసమును బట్టి శారాయు వాగ్దానము చేసినవాడు నమ్మదగిన వాడని యెంచుకొనెను" (హెబ్రీ 11 : 11).

వయస్సు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తిపొందెను. అందుచేత ఆ మృతతుల్యుడైన ఆ ఒకని నుండి లెక్కింప నశక్యమైన సంతానము కలిగెను. మరియు ఆమె విశ్వాసులకు తల్లి ఆయెను (గలతీ 4 : 26).

4. "యోసేపు తనకు అవసాన కాలము సమీపించి నప్పుడు విశ్వాసమును బట్టి ఇశ్రాయేలు కుమారుల నిర్గమమును గూర్చి ప్రశంసించి తనశల్యములను గూర్చి వారికి ఆజ్ఞాపించెను" (హెబ్రీ 11 : 22).

ఎ) ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి నిర్గమించి, వాగ్దత్త దేశమైన కనాను చేరుసరికి యోసేపు చనిపోయెను (ఆది 50 : 24 - 26). తాను చూడని

దానిని విశ్వసించి, ఇశ్రాయేలీయుల నిర్గమమును ప్రశంసించెను. మృతుల పునరుత్థానమందు విశ్వాసము గలవాడై తన యెముకలను గూర్చి ఆజ్ఞాపించెను.

5. "విశ్వాసమును బట్టి .......... బలహీనులుగా ఉండి బలపరచబడిరి" (హెబ్రీ 11 : 33).

ఎ) యోబు విశ్వాసమును బట్టి శ్రమలను సహించుకొనెను (యాకోబు 5 : 10, 11).

బి) దేవునికి వ్యతిరేకముగా మాటలాడిన తన భార్యను గద్దించెను (యోబు 2 : 10). " నా చర్మము చీకిపోయిన తరువాత శరీరముతో నేను దేవుని చూచెదను" అని విశ్వాసమును బట్టి చెప్పగలిగెను (యోబు 19 : 26). గనుకనే యోబు తన నీతి చేత తనను మాత్రమే రక్షించుకొనెను (యెహెజ్కేలు 14 : 14).

6. "విశ్వాసమును బట్టి మోషే అదృశ్యుడైన వానిని చూచుచున్నట్టు స్థిర బుద్ధి గలవాడై, రాజాగ్రహమునకు భయపడక ఐగుప్తును విడచి పోయెను" (హెబ్రీ 11 : 27).

ఐగుప్తు ధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొనెను. అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించెను. ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు. గనుకనే మోషే భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడనియు, అతడు నా యిల్లంతటిలో నమ్మకమైన వాడనియు దేవుని వలన సాక్ష్యము పొందెను (సంఖ్యా 12 : 3, 7 ; హెబ్రీ 3 : 2).

7. దావీదు విశ్వాసమును బట్టి రాజ్యములను జయించెను ; నీతి కార్యములు జరిగించెను ; యుద్ధములో బలపరాక్రమశాలుడాయెను ; అన్యుల సేనలను పారద్రోలెను (హెబ్రీ 11 : 33, 34)

"జీవముగల దేవుని (అదృశ్యుని) దర్శించుటకు నా హృదయమును నా శరీరమును ఆనందముతో కేకలు వేయుచున్నవి" (కీర్తనలు 84 : 2). "సజీవుల దేశమున (అదృశ్యమైనది) నేను యెహోవా దయను పొందుదునన్న నమ్మకము నాకు లేనియెడల నేను యేమవుదును?" (కీర్తనలు 27 : 13). "నేనైతే నీతిగలవాడనై నీ ముఖ దర్శనము చేసెదను; నేను మేల్కొనునప్పుడు (పునరుత్థానమున) నీ స్వరూప దర్శనముతో నా ఆశను తీర్చుకొందును" (కీర్తనలు 17 : 15). గనుకనే అతడు దేవుని చిత్తానుసారమైన మనస్సు గలవాడని పేరు పొందెను ( I సమూ 13 : 14).

ఈ విశ్వాస వీరులందరు దేవుని యందును, మృతుల పునరుత్థాన మందును, తీర్పు యందును, పరలోకము నందును విశ్వాసము కలిగి తమ అసువులు బాసిరి. వారు మరి శ్రేష్ఠమైన దేశమును, అనగా పరలోకసంబంధమైన దేశమును కోరుకొన్నారు. అందుచేత దేవుడు వారి కొరకు ఒక పట్టణమును సిద్ధపరచి యున్నాడు (హెబ్రీ 11 : 16). "వీరందరు తమ విశ్వాసము ద్వారా సాక్ష్యము పొందిన వారైనను మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము, దేవుడు మన కొరకు మరి శ్రేష్ఠమైన దానిని ముందుగా సిద్ధపరచెను" (హెబ్రీ 11 : 40).

గనుక నీ బాధ్యత యేమిటో గ్రహించితివా? క్రీస్తు యిట్లు ఆజ్ఞాపించుచున్నాడు: "మరణము వచ్చినను విశ్వాసము కలిగి యుండుము; అప్పుడు నీకు జీవ కిరీటము యిత్తును" (ప్రకటన 2 : 10). నీవు విశ్వాసము నందు నిలుకడగా నుండిన యెడల ఈ వాగ్దానము నీకును వర్తించును!

# సంక్షిప్త వార్తలు

1995 డిశంబరు మొదటివారంలో సింగపూర్‌లో జరిగిన Asian Bible Lectureship లో పాల్గొనుటకు గాను జాషువాగూటం దంపతులు అక్కడికి వెళ్ళి క్షేమముగా కాకినాడకు తిరిగి చేరుకొనిరి. ఆ లెక్చర్‌షిప్‌లో ఒక ప్రసంగీకునిగా సోదరులు వెళ్లుట జరిగినది.

డిశంబరునెల సువార్తికుల సదస్సు తూర్పుగోదావరి జిల్లా పసుపల్లిలో ఆశీర్వాదకరముగా జరిగెను. రాష్ట్రంలో నలుమూలలనుండి తరలివచ్చిన సువార్తికుల సమక్షంలో "క్రీస్తు సంఘమనగానేమి ? దానిలో యున్న ఆశీర్వాదము లేవి ?" యను అంశము చర్చింపబడెను. ఉదయకాల సమావేశమునకు సోదరులు V.చిన్నయ్యగారు, మధ్యాహ్నకాల సమావేశమునకు సోదరులు G.షడ్రక్‌గారు అధ్యక్షులుగా నుండి కార్యక్రమమును చక్కగా నడిపించిరి. బూల యోహాను, U. స్టాలిన్, K. తాతరావు. S.వీరంశెట్టి, E.K.V.ప్రసాదరావు, P.S.R.జయపాల్,పాల్‌గూటం మరియు జాషువాగూటం గార్లు పై అంశముపై చక్కటి వర్తమానమునందించిరి.

క్రీస్తుయేసు నందు పరిశుద్ధపరచబడి పరిశుద్ధులుగా నుండుటకు పిలువబడిన వారే క్రీస్తు సంఘము (1 కొరింధీ 1:2). క్రొత్తనిబంధన సంఘము రాజ్యము (మత్తయి 16 : 19), క్రీస్తుశరీరము (ఎఫెసీ 1 : 22),మందిరము (1 పేతురు 2 : 5), మంద (అపో.కా.20 : 28), యిల్లు (హెబ్రీ 3 : 6), ద్రాక్షతోట (యోహాను 15 : 1-4), దేవుని సంఘము,జ్యేష్ఠుల సంఘము (హెబ్రీ 12 :23) అను పర్యాయ పదములతో వర్ణించబడినది. క్రీస్తుసంఘములో యున్న వారికి పాపమునుండి విమోచన,క్రొత్త సృష్టి,నిత్యజీవమను ఆశీర్వాదములేగాక క్రీస్తుయేసు నందున్న ప్రతి ఆత్మీయాశీర్వాదము లభించును. సర్వమానవాళిని క్రీస్తులో ఏకము చేసిన ఆశీర్వాదములు సంఘములో ఉన్నాయి. క్రీస్తు శరీరమే క్రీస్తుసంఘము. క్రీస్తుశరీరము నిత్యమైనది,అక్షయ మైనది. సదాకాలము నిలుచునది. క్రీస్తు సంఘములోనే సమృద్ధియైన జీవముకలదు అని సోదరులు

వివరించిరి. -

ఇటీవల సింగపూర్ ప్రయాణములో క్షేమముగా తిరిగివచ్చిన జాషువాగూటం దంపతులును పసుపల్లి క్రీస్తుసంఘము, N.J. మెహన్ రావ్ దంపతులు సత్కరించిరి. పసుపల్లిలో పెంతెకోస్తుసంఘము క్రీస్తులోనికి మార్పుచెందగా అదే స్థలములో క్రీస్తు సంఘారాధన జరుపుటకు నిర్మించిన ప్రార్థనామందిరమున్ను జాషువాగారు రిబ్బను కత్తిరించి ప్రవేశము గావించిరి. సోదరులు N.J. మోహనరావ్‌గారు కొత్తపేటలోను, పరిసరప్రాంతాలలోను, పసుపల్లిలోను మంచి సువార్తపని చేయుచున్నారు. స్థానిక సంఘము మంచి ఏర్పాట్లుచేసి, చక్కటి అతిధ్యమునిచ్చి సదస్సును ఘనముగా నిర్వహించిరి,

1996 జనవరి 26,27, 28 తేదిలలో కాకినాడ సత్యవాణి భవనంలో ఒరిస్సా రాష్ట్రవాసులకు ఒరియా బైబిలు సెమినార్ నిర్వహించబడును. దానిలోపాల్గొను వారందరి కొరకు ప్రార్థించమనవి.

---

Regd. No. R/KD-45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To